

నవరాత్రుల సందడి ప్రారంభం కాబోతోంది. తొమ్మిది రోజులు పూజలు, భజనలు, ప్రసాదాలు, అన్నదానాలతో ప్రతీ వాడ, పల్లె అధ్యాత్మిక శోభ సంతరించుకోనున్నది. ఈ క్రమంలో మట్టి విగ్రహాలను వినియోగించుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు హాని కలిగిస్తున్న నేపథ్యంలో 'ఎకో ఫ్రెండ్లీ గణపయ్య'ను ప్రతిష్ఠించుకోవాలని కోరుతున్నారు. ఇందుకు అనుగుణంగా నగరంలో పెద్దఎత్తున మట్టి విగ్రహాల తయారీ ఊపందుకుంది. వివిధ ఆకృతులు, రంగులతో ఆకర్షణీయంగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇందుకోసం పల్లెల్లో పొలాల్లోని మట్టిని, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచు, కర్రలను ఉపయోగించి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కాగా, నగరంలోని ఎల్లమ్మబజార్‌లో 40 అడుగుల అతిపెద్ద మట్టి విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తర్వాత వరంగల్‌లో పెద్దదైన విగ్రహం ఏర్పాటు చేయనుండడం గమనార్హం.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

Sunday SPECIAL

మట్టి గణపతికి జైహో



వరంగల్ ఎల్లమ్మబజార్‌లో తొలిసారిగా రూపుదిద్దుకుంటున్న 40 అడుగుల భారీ మట్టి విగ్రహం



- మట్టి వినాయక విగ్రహాల వైపు జనం ఆసక్తి
- నవరాత్రి ఉత్సవాల్లో కొలువుదీరనున్న మట్టి గణపతులు
- 'ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు'కి పెరుగుతున్న ఆదరణ
- నగరంలో పెద్దఎత్తున విగ్రహాల తయారీ
- అందుబాటు ధరల్లో అన్ని చోట్ల అమ్మకానికి సిద్ధం
- ఎల్లమ్మబజార్‌లో తొలిసారి 40 అడుగుల భారీ మట్టి విగ్రహం

5

ప్రైవేటు ఆస్పత్రుల్లో డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరి

కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

ఘన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యులు ఆలస్యంగా రావడంపై కలెక్టర్ ఆగ్రహం

కేజీబీవీలో నాణ్యమైన బోధన అందించడం లేదని మండిపాటు



ఎస్సీ బాలికల హాస్టల్‌లో పరిసరాలను పరిశీలించి సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 31: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రతీ రోజు అందుబాటులో ఉండే డాక్టర్ల పేర్లు, వివిధ పరీక్షలకు అయ్యే ఖర్చుల వివరాలకు సంబంధించిన వివరాలను ప్రతీ రోజు ఆస్పత్రుల్లో డిస్‌ప్లే బోర్డులపైన నమోదు చేయాలని లేదంటే జరిమానాలు తప్పవని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా హెచ్చరించారు. శనివారం డివిజన్ కేంద్రంలోని మోతె ప్రైవేట్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిబంధనల మేరకు ఎలాంటి డిస్‌ప్లే బోర్డులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెస్టుల పేరుతో ఆస్పత్రికి వచ్చే రోగుల వద్ద నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద టెస్టుల చార్జీల వివరాలు బోర్డుల పైన ప్రదర్శించాలని ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని లేదంటే ప్రతీ రోజు రూ 25వేల జరిమానా విధించడం తప్పదన్నారు. అంతకుముందు డివిజన్ కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం వార్డులలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డాక్టర్లు సమయానికి రావడం లేదని రోగులు తెలుపడంతో వైద్య సిబ్బందిపై మండిపడ్డారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అక్కడి నుంచి డివిజన్ కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి వంటగదిని పరిశీలించారు. 9, 10వ తరగతి గదుల్లోకి వెళ్లి పాఠ్యాంశాల పైన పలు ప్రశ్నలు అడుగగా సరైన సమాధానం ఎవరూ చెప్పకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠ్యాంశాలను సరిగ్గా బోధించాలని క్లెవర్, డల్ విద్యార్థులను కలిపి తరగతిగదిలో కూర్చోబెట్టి విషయాలను తెలుసుకునేలా వారి స్థాయికి దిగి బోధన చేయాలని సూచించారు. అక్కడి నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఆ తరువాత ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించే దిశగా కష్టపడాలని అందుకు ఉపాధ్యాయులు సరైన ప్రణాళిక మేరకు విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌కుమార్, డాక్టర్ జనార్దన్, డాక్టర్ సంధ్య, ఎంఎన్‌వో కొమురయ్య, సంపత్, సెక్రటరీలు తిరునగిరి శ్రీకాంత్, సత్యనారాయణ, జేసుమణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- కొడకండ్లలో అత్యధికంగా 95.8 మి.మీ వర్షపాతం

జనగామ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో కొడకండ్ల మండలం మినహా మిగతా మండలాల్లో మోస్తరు వర్షం పడింది. కొడకండ్లలో 94.8 మి.మీ భారీ వర్షం కురియగా అత్యల్పంగా బచ్చన్నపేట మండలం పడమటికేశవాపూర్‌లో 0.5 మి.మీ వర్షం పడింది. అదే విధంగా దేవరుప్పులలో 39.8 మి.మీ, పాలకుర్తి మండలం వావిలాలలో 37.8 మి.మీ, నర్మెట్టలో 36.5 మి.మీ, చిల్పూరు మండలం మల్కాపూర్ 30.8 మి.మీ, బచ్చన్నపేటలో 28.3 మి.మీ, తరిగొప్పులలో 27 మి.మీ, జనగామలో 22.5 మి.మీ, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారం 21.8 మి.మీ, దేవరుప్పుల మండలం కోలుకొండలో 17.8 మి.మీ, జఫర్‌ఘడ్ 17.5 మి.మీ, లింగాల ఘనపురం 16 మి.మీ, పాలకుర్తి మండలం గూడూరులో 14.5 మి.మీ, పాలకుర్తిలో 14.3 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో 10.5 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 10.3 మి.మీ, జఫర్‌ఘడ్ మండలం కూనూరులో 8.8 మి.మీ, జనగామ మండలం వడ్లకొండలో 6.3 మి.మీ, రఘునాథపల్లిలో 4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నెరవేరిన 'పీహెచ్‌డీ' కల

ఎట్టకేలకు వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లు

న్యాయపరమైన సమస్యలు రాకుండా అప్రమత్తత

అన్ని విభాగాల్లోనూ విద్యార్థుల జాయినింగ్

ఆనందోత్సాహాల్లో అభ్యర్థులు

వివరాలు 5వ పేజీలో...



అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఏఎంవో శ్రీనివాస్ (ఫైల్)

ప్రతీ అడుగు.. స్వచ్ఛత వైపు

- బడుల్లో సమాజం, పరిశుభ్రతపై అవగాహన
- పాఠశాలల్లో నేటి నుంచి పక్షోత్సవాలు
- పదిహేను రోజుల పాటు కార్యక్రమాలు
- జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు

జనగామ కల్చరల్, ఆగస్టు 31 : పాఠశాలలు, విద్యార్థుల్లో పరిశుభ్రతను పెంచడమే లక్ష్యంగా ఈ నెల 1 నుంచి 15 వరకు పాఠశాలల్లో పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. విద్యార్థి దశ నుంచే చిన్నారులకు పరిసర పరిశుభ్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో స్వచ్ఛతా పక్షోత్సవాల పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లా విద్యాశాఖాధికారి స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులను భాగస్వాములను చేస్తున్నారు. వర్షాకాలంలో పలు పాఠశాలల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో అపరిశుభ్రత నెలకొంది. దీంతో పిల్లలకు వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చేపడుతున్న స్వచ్ఛ పక్షోత్సవాలతో సత్ఫలితాలు రానున్నాయి. స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణ, సమాజానికి చేరువ కావడం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

క్లీన్ ఇండియా నినాదంతో...

క్లీన్ ఇండియా బ్యూటిఫుల్ ఇండియా నినాదంతో చేపట్టే స్వచ్ఛత పక్వాడా అమలులో భాగంగా కార్యక్రమాలు ఇలా ఉండనున్నాయి. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రతీ ఒక్కరిలోనూ అవగాహన పెంపొందించడం, సమాజ భాగస్వామ్యం కల్పించడం, మొక్కలు నాటి ప్రకృతి చైతన్యాన్ని కలుగజేయడం, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యాలుగా ఈ స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలను నిర్వహించనున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాల స్థాయి పోటీలు కూడా నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు.

నేటి నుంచే ప్రారంభం ...

పరిశుభ్రత, ఆరోగ్యం లక్ష్యంతో సెప్టెంబరు 1 నుంచే 'స్వచ్ఛ పక్వాడ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సెప్టెంబరు 15 వరకు పదిహేను రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ప్రతీ రోజు స్వచ్ఛ పక్వాడాలో భాగంగా రోజుకో కార్యక్రమం నిర్వహిస్తారు. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కలిగించడం, సమాజంపై బాధ్యత, వారిలో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు జనగామ జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము నేతృత్వంలో ఉపాధ్యాయులను సన్నద్ధం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయాలు, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. స్వచ్ఛత పక్షోత్సవాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు అవగాహన పెరిగి పరిసరాల పరిశుభ్రతపై వ్యక్తిగత శుభ్రతతో పాటు సమాజానికి మేలు జరిగే అవకాశం ఉంది. కార్యక్రమంపై ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఆసక్తి, అభిరుచి పెంపొందించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

స్వచ్ఛత ప్రతిజ్ఞ ...

నేను పరిశుభ్రత పట్ల కట్టుబడి ఉంటానని, దీని కోసం సమయం కేటాయిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఏడాదికి 100 గంటలు పరిశుభ్రత కోసం కేటాయిస్తాను. నేను చెత్త వేయను.. ఇతరులతో చెత్తను వేయనీయను. నేను, నా కుటుంబం, నా చుట్టుపక్కల, నా గ్రామం, పాఠశాలలో పరిశుభ్రత కోసం ప్రతీ నిత్యం కట్టుబడి ఉంటాను.

పటిష్టంగా అమలు చేస్తాం : కె.రాము, డీఈవో, జనగామ



రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహిస్తాం. పదిహేను రోజుల పాటు రోజుకో అంశాన్ని తీసుకొని విద్యార్థులలో చైతన్య కార్యక్రమాలు, అవ గాహన చేపట్టాలి. సమాజానికి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే పాఠశాల విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు...

జిల్లాలో 341 ప్రాథమిక పాఠశాలలు, 64 ప్రాథమికోన్నత పాఠశాలలు, 103 ఉన్నత పాఠశాలలతో మొత్తం 508 ప్రభుత్వ పాఠశాలలుండగా 12 కేజీబీవీలు, 8 ఆదర్శ పాఠశాలలు, 19 సంక్షేమ గురుకులాలున్నాయి.



జనగామలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేతులు శుభ్రపరుచుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కాంగ్రెస్‌వి చిల్లర రాజకీయాలు




మాట్లాడుతున్న వినయభాస్కర్

- ఇచ్చిన హామీలు అమలు చేయలేని చేతకానితనం
- దేవాదులకు హడావుడిగా శంకుస్థాపన చేసిన బాబు
- అంచనాలు పెంచి డబ్బులు దండుకున్న కాంగ్రెస్
- లక్షలు వెచ్చించి ప్రాజెక్టుల నిర్మాణాలు చేసిన బీఆర్‌ఎస్
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

రాంనగర్, ఆగష్టు 31: అధికారం కోసం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీ.. బీఆర్‌ఎస్ పాలనపై ఆరోపణలు చేస్తూ చిల్లర రాజకీయాలు చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ధ్వజమెత్తారు. శనివారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వినయభాస్కర్ మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టుకు వచ్చిన మంత్రుల బృందం అవగాహన రాహిత్యంతో విమర్శలు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కువకాలం అధికారంలో ఉన్నది కాంగ్రెస్, టీడీపీ పార్టీలేనన్నారు. ఈ రెండు పార్టీలు ప్రధానంగా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశాయని దుయ్యబట్టారు. ఆ రెండు పార్టీలు వ్యవసాయం దండుగ అంటే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పండుగ చేసి చూపించిందన్నారు. ఎన్నికల కోసం 2003లో అప్పటి సీఎం చంద్రబాబు హడావుడిగా దేవాదుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాడని పేర్కొన్నారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4వేల కోట్లు ఉన్న ప్రాజెక్టు అంచనాను రూ.10వేల కోట్లకు పెంచి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఆ రెండు పార్టీల హయాంలో ఎలాంటి పనులు జరుగలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టిందన్నారు. దేవాదుల ప్రాజెక్టుపై ఏ మాత్రం అవగాహన లేని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేశాడని వినయభాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి కేసీఆర్‌ను పొగుడుతూ మాట్లాడిన వీడియో ను వినయభాస్కర్ మీడియాకు వినిపించారు. హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. కాళేశ్వరం, దేవాదుల, ఫోన్ ట్యాపింగ్‌లంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వినయభాస్కర్ ధ్వజమెత్తారు. మాజీ ఉప ముఖ్యమంత్రి టి.రాజయ్య మాట్లాడుతూ.. ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కడియం శ్రీహరి చేసిన విమర్శలు సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం దేవాదులను 90శాతం పూర్తి చేసిందన్నారు. కాంగ్రెస్ మంత్రులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. నేతలు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లడుతూ నాగుర్ల వెంకటేశ్వర్లు, సుధీర్‌కుమార్, జనార్దన్ గౌడ్ పాల్గొన్నారు.

లైన్ షిఫ్టింగ్‌కు లంచం

- ఏసీబీకి చిక్కిన స్టేషన్‌ఘన్‌పూర్ విద్యుత్ డీఈఈ
- రైతు దగ్గర నుంచి రూ.20వేలు తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి పట్టుబడిన విద్యుత్ డీఈఈ హుస్సేన్ నాయక్

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 31: 33/11 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టు చేసేందుకు ఎల్‌సీ ఇవ్వడానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎన్పీడీసీఎల్ డీఈఈ హుస్సేన్‌నాయక్ రైతు కుంభం రాజు అనే రైతు వద్ద నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన రైతు కుంభం ఎల్లయ్యకు ఘన్‌పూర్ మోడల్ కాలనీ శివారులో ఉన్న వ్యవసాయ పొలం మధ్యగా 33/11 కేవీ విద్యుత్ లైన్ ఉంది. దీంతో పంటలను సాగు చేయడానికి ఇబ్బందులు పడుతున్నాడు. తన పంటచేనులోనే ఉన్న సుమారు 800 మీటర్ల పొడవు ఉన్న విద్యుత్‌లైన్‌ను ఓ పక్కకు షిఫ్టు చేయాలని మూడు నెలల కిందట విద్యుత్ అధికారులను సంప్రదించాడు. లైన్ షిఫ్టు చేయడానికి రూ.16లక్షలతో సబ్ ఇంజనీర్, ఏడీఏలు ఎస్టిమేషన్ తయారుచేసి ఇచ్చారు. ఈ మేరకు ఎల్లయ్య కుమారుడు రాజు రూ.16లక్షల డీడీ కట్టి అధికారులకు ఇవ్వగా, ప్రైవేట్ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. విద్యుత్ టవర్‌లను ఏర్పాటు చేశాడు. అయితే విద్యుత్ లైన్లు లాగడానికి ఎల్‌సీ కోసం సైతం రూ.2లక్షలు చార్జీలు చెల్లించాడు. డీఈఈ సంప్రదించి ఎల్‌సీ తీసుకోవాలని కాంట్రాక్టర్ రైతుకు తెలిపారు. దీంతో ఈ నెల 28న బాధితుడు కుంభం రాజు డీఈఈని ఆయన కార్యాలయంలో కలిసి ఎల్‌సీ ఇవ్వాలని కోరాడు. రూ.50వేలు లంచం అడుగగా అంత ఇవ్వలేనని రూ.20వేలు ఇస్తానని చెప్పాడు. మూడునెలలుగా విసిగిపోయిన బాధిత రైతు.. వరంగల్ ఏసీబీని ఆశ్రయించాడు. పథకం ప్రకారం శనివారం సాయంత్రం డీఈఈకి ఫోన్ చేసి ఈ రోజు డబ్బులు ఇస్తానని చెప్పా డు. రాత్రి 8గంటల సమయంలో డబ్బులు పట్టుకొని డీఈఈ కార్యాల యానికి వెళ్లి రూ.20వేలు డీఈఈకి అందిస్తున్న క్రమంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ఇందులో సీఐలు సట్ల రాజుగౌడ్, శ్యాంసుందర్, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



బాధితుడు కుంభం రాజు

పీడిత ప్రజలే గద్దర్ వారసులు

గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి సూర్యకిరణ్

వడ్డేపల్లి, ఆగస్టు 31: దేశ పీడిత ప్రజల విముక్తి కోసం తుది వరకు పోరాడిన ప్రజా యుద్ధ నౌక, ప్రముఖ వాగ్గేయకారుడు గద్దర్‌కు నిజమైన వారసులవుతారని గద్దర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్ అన్నారు. గద్దరన్న విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ జిల్లా చైర్మన్ కోండ్ర నర్సింగరావు అధ్యక్షతన శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన గద్దర్ ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి త్యాగపూరిత పోరాటం చేసిన గద్దర్ విగ్రహాలను, స్మృతి వనాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గద్దరన్న స్ఫూర్తితో చెట్టు, పుట్టతో మమేకమై జీవిస్తున్న ఆదివాసీల రక్షణ కోసం, అణగారిన ప్రజల హక్కుల కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు.

తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. గద్దరన్న ప్రతీ మాటలో, ప్రతీ అడుగులో, ప్రతీ పాటలో పీడిత ప్రజల విముక్తి కోసం సందేశం ఉండేదని చెప్పారు. త్యాగానికి ప్రతిరూపమైన గద్దరన్న తన భార్యా, బిడ్డ, కొడుకు కోసం ఆలోచన చేయకుండా ప్రజల కోసమే పనిచేసి అమరజీవిగా నిలిచి పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ప్రజా సంఘాల జేఏసీరాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. పుట్టుక, చావు తనది, బతుకంతా ప్రజల పక్షాన నిలబడి, కలబడి పోరాటం చేసిన గద్దర్ జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని ఆయన పేరిట స్మృతి వనాలను ఏర్పాటు చేయాలని కోరారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో గద్దర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి గద్దర్ కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. విముక్త చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ గద్దరన్నను, గద్దర్ చరిత్రను చంపాలని, రూపు మాపాలని చూస్తున్నారని, ఏ పార్టీ కోసం ఆయన తన సర్వస్వాన్ని త్యాగం చేశాడో ఆ పార్టీ నేడు గద్దర్‌ను స్మరించుకోవడం లేదని విమర్శించారు. ఈ సభలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ నేత సాయిని నరేందర్, గద్దర్ కోడలు సరిత, గద్దర్ సహచరుడు సీఎల్. యాదగిరి, వివిధ ప్రజా సంఘాల నాయకులు సుంకరి భిక్షపతి, గాజుల గోవర్ధన్, పటేల్ వనజక్క, సోమా రామమూర్తి, కూనూరు రంజిత్‌గౌడ్, చుంచు రాజేందర్, కరేటి శంకర్ రావు యాదవ్, వెంగ శిరెడ్డి, రామబ్రహ్మం, నున్న అప్పారావు, తాడిశెట్టి క్రాంతికుమార్, కేడెల ప్రసాద్, మన్నె బాబురావు, బండి మొగిలి, రాజమహ్మద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న గుమ్మడి సూర్యకిరణ్, వేదికపై ప్రొఫెసర్ వెంకటనారాయణ, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, డాక్టర్ పృథ్వీరాజ్

కాజీపేట మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు

కాజీపేట, ఆగస్టు 31: కాజీపేట - హసన్‌పర్తి మధ్య రైల్వే నాలుగో రైల్వే ట్రాక్ నిర్మాణాల నేపథ్యంలో సెప్టెంబర్ 23 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే కాగజ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ రైలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబరు 8 వరకు, సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2 వరకు, గుంటూరు - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 2 వరకు, విజయవాడ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్ డౌన్ సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 7 వరకు రద్దు చేశారు. కాజీపేట - సిర్పూర్ టౌన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 8 వరకు, బల్లార్ష - భద్రాచలం రోడ్‌ల మధ్య నడిచే సింగరేణి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్ రైలు సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 8 వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నారని చెప్పారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య



కాజీపేట బాలవికాసలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కాజీపేట, ఆగస్టు 31: సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్. తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మాదిగలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కాజీపేట బాలవికాస సెంటర్‌లో శనివారం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు మైసా ఉపేందర్ అధ్యక్షత మాదిగ రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, మాజీ జడ్పీ చైర్మన్ డాక్టర్. ఎం.సుధీర్‌కుమార్‌లు హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా మాదిగలు అన్నిరంగాల్లో తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మాదిగల రిజర్వేషన్‌ల కోసం మాదిగ సంఘాలు చేసిన ఉద్యమాలతోనే సుప్రీంకోర్టు అనుకూల తీర్పుఇచ్చిందన్నారు. రిజర్వేషన్లు అమలు అయ్యేవరకు మాదిగలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు బొట్ల భిక్షపతి మాదిగ, నాయకులు జనగాం నర్సింగ్, గోవింద్, నవీన్ కు మార్, వీరస్వామి, బండ శ్రీనివాస్, జన్ను మధు, గంగారపు అమృతరావు, ఆరూరి రంజిత్, పరం జ్యోతితోపాటు మాదిగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రుద్రేశ్వరాలయంలో సినిమా యూనిట్ పూజలు

వేయిస్తంభాల ఆలయంలో సినిమా షూటింగ్

సందడి చేసిన హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 31: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సినిమా షూటింగ్ ప్రారంభమైంది. సుమారు దశాబ్దకాలం తరువాత వేయిస్తంభాల కల్యాణ మండప పనులు పూర్తయిన నేపథ్యంలో చాలా కాలం చిత్రీకరణ సందడి మొదలైంది. వరంగల్‌కు చెందిన ప్రముఖ నిర్మాత మధుర శ్రీధర్.. మాధవి ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' షూటింగ్ తొలి షెడ్యూల్ వేయిస్తంభాల ఆలయంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా ఐదు గంటలపాటు కొనసాగింది. దర్శకుడిగా సంజీవ్ వ్యవహరిస్తున్న ఈ సినిమాలో హీరోగా విక్రాంత్, హీరోయిన్‌గా చాందినీ చౌదరి నటిస్తున్నారు. హీరోయిన్ తండ్రిగా బలగం ఫేం మురళీధర్‌గౌడ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రేమ ప్రధానంగా, సెంటిమెంట్‌తోపాటు సమాజానికి మంచి సందేశాన్ని అందించే సినిమాను నిర్మిస్తున్నట్లు మధుర శ్రీధర్ చెప్పారు. హీరో విక్రాంత్, హీరోయిన్ చాందిని, తండ్రి పాత్రలపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు ఆలయంలోని రుద్రేశ్వరుడికి సినిమా యూనిట్ ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ సినిమా యూనిట్‌ను సాదరంగా స్వాగతించి పూజలు నిర్వహింపజేసిన అనంతరం ఈ సినిమా విజయవంతం కావాలని ఆశీర్వదించారు. మరో మూడు రోజులుపాటు షూటింగ్ నిర్వహిస్తామని శ్రీధర్ తెలిపారు.



షూటింగ్‌లో హీరో, హీరోయిన్

మట్టి గణపతికి జయహో

● మట్టి వినాయక విగ్రహాల వైపు జనం చూపు ● నగరంలో పెద్దఎత్తున విగ్రహాల తయారీ



హనుమకొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ వస్తోంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి. ప్రతీ వీధిలో గణేషుడు కొలువుదీరనున్నాడు. ఈ నేపథ్యంలో చాలామంది ఎకో ఫ్రెండ్లీ గణేషుడిని పూజించేందుకు మక్కువ చూపుతున్నారు. అనేక గణేష్ మండపాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఇష్టపడుతున్నారు. ఇదివరకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేసిన విగ్రహాలనే ఎక్కువగా పూజించేవారు. చూడటానికి ఇవి ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో చాలామంది వీటినే ప్రతిష్ఠించడానికి ఆసక్తికనబరిచేవారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అందమైన విగ్రహాలను తయారు చేసి వాటికి వివిధ రంగులను జోడించి తయారు చేసిన వినాయక విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసిన సమయంలో అవి విషపూరితమైన కెమికల్స్‌ను విడుదల చేయడంవల్ల పర్యావరణానికి హానికలిగేది. అయితే కరోనా మహమ్మారి తర్వాత 'గో గ్రీన్.. సేవ్ లైఫ్' పేరుతో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను తయారు చేయడం.. మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించడం వంటివి మొదలు పెట్టారు. ప్రస్తుతం వాటినే ట్రెండ్‌గా సెట్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఎక్కువమంది మట్టి వినాక విగ్రహాలను పూజించేందుకు, భక్త మండళ్లు వాటినే ప్రతిష్ఠించేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో మట్టి విగ్రహాలకు క్రమంగా డిమాండ్ పెరగడంతో తయారీదారులు పీవోసీ నుంచి మట్టివిగ్రహాల వైపు మళ్లుతున్నారు. ఆ మేరకు పీవోసీ విగ్రహాలతో పోటీపడేలా అంతకన్నా అందంగా ఉండేలా మట్టిగణపతులను రూపొందించి మార్కెట్‌లో విక్రయానికి పెడుతున్నారు.

జోరుగా మట్టి విగ్రహాల తయారీ

ప్రస్తుతం వరంగల్ నగరంలో పలు చోట్ల రోడ్ల పక్కన అమ్మకానికి పెట్టిన గణనాథుల విగ్రహాల్లో మట్టి విగ్రహాలే ఎక్కువగా ఉన్నాయి. పీవోసీ కన్నా మట్టి విగ్రహాలను తయారు చేయడం కొంచెం కష్టమే. అయితే పీవోసీ విగ్రహాల తయారీకయ్యే ఖర్చుతో పోల్చితే కొంత మేరకు చౌకనే. పైగా విగ్రహాల తయారీలో ఉపయోగించే ముడిసరుకు స్థానికంగానే దొరుకుతుంది. కాస్త నైపుణ్యం, సృజనాత్మకతను జోడిస్తే మట్టి విగ్రహాలను మరింత అందంగా తయారు చేయవచ్చునని చెబుతున్నారు విగ్రహ తయారీదారులు. మట్టి విగ్రహాలను పూజించాలన్నదే హిందూ సంప్రదాయం. ధార్మిక సంస్థలు, పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఇటీవలకాలంలో దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం కూడా మట్టి వినాయకులపై ఆదరణ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు చాలా మంది తయారీదారులు మట్టివిగ్రహాలను తయారు చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో మట్టి విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది.

పెద్ద ఎత్తున ఆదరణ

వినాయక చవితి పండుగకు నెల రోజుల ముందుగానే చాలామంది మట్టి విగ్రహాల తయారీకి ఆర్డర్స్ ఇచ్చి తయారు చేయించుకుంటున్నారు. బిహార్, కోల్‌కత్తా, మహారాష్ట్ర నుంచి వల వచ్చిన కుటుంబాలు ఇప్పటికీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను తయారు చేస్తుండగా.. స్థానికులు మాత్రం మట్టి విగ్రహాలను రూపొందిస్తున్నారు. వినాయక చవితికి ఇంకా ఏడు రోజులే మిగిలి ఉండడంతో క్షణం తీరిక లేకుండా రాత్రింబవళ్లు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. వీటి ధరలు కూడా విగ్రహం ఎత్తును బట్టి రూ 2వేల నుంచి రూ.20వేల వరకు ఉన్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కన్నా ఒకింత తక్కువగానే ఉన్నాయి. అయితే పీవోపీ విగ్రహాల అంత ఎత్తు, ఆ రకమైన డిజైన్లలో వీటిని చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం వాటి బరువు పెరగడం, ఖర్చు కూడా అధికం కావడం.

11 ఏళ్లుగా తయారీలో..



మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయడం ఒక కుటీర పరిశ్రమలా గొట్టే శివకుమార్ కొనసాగిస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆయన 11 ఏళ్ల మట్టి విగ్రహాలనే తయారు చేసి అమ్ముతున్నాడు. విగ్రహాల తయారీకి పొలాల్లోని బంకమట్టినే వాడుతున్నాడు. ఆ మట్టిలో రాళ్లలేకుండా శుభ్రం చేసి అందులో కొంత ఇసుక కలిపి, స్థానికంగా దొరికే ఎండుగడ్డి, కొబ్బరిపీచుతో వీటిని తయారు చేస్తున్నాడు. విగ్రహం పటిష్ఠంగా ఉండడానికి వాటి తయారీలో స్థానికంగా దొరికే కర్రలను వినియోగిస్తున్నాడు. మట్టి విగ్రహాల తయారీ వల్ల స్థానిక మహిళలకు కూలీ దొరుకుతోంది. సుమారు 30 నుంచి 40 మంది మహిళలు వీటి తయారీలో పాలుపంచుకుంటున్నారు. వారికి రోజువారీ కూలీ చెల్లిస్తున్నాడు. జూన్ నుంచి ఆగస్టు వరకు నాలుగు నెలల పాటు వారికి చేతినిండా పని ఉంటుందని శివకుమార్ చెబుతున్నాడు. మూడు నుంచి తొమ్మిది అడుగుల ఎత్తు వరకు ఉండే ఈ విగ్రహాలను ఏటా సుమారు 150 వరకు తయారు చేసి వరంగల్ నగరంతో పాటు హైదరాబాద్ తదితర పట్టణాల్లో విక్రయిస్తున్నాడు. పీవోపీ విగ్రహాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో అత్యంత అందమైన రీతిలో వీటిని తయారు చేస్తున్నారు. విగ్రహాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వాటిని ప్రకృతిలో లభించే రంగులతోనే తీర్చిదిద్దడంతో పాటు వాటిని స్థానిక మహిళలు రూపొందించి ఎంబ్రాయిడరీ వస్త్రాలతో అలంకరించడంతో అవి మరింత అందంగా, సహజసిద్ధమైన సౌందర్యంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఇవి హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ వద్దనే కాకుండా పలు ఇతర చోట్ల అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.

ఆసక్తి చూపుతున్నారు..

మురావత్ విజయకుమార్, సేల్స్‌మన్



ఏటా 150కిపైగా మట్టి విగ్రహాలను విక్రయిస్తుంటాం. మార్కెట్‌లో ట్రెండ్‌ను బట్టి సరికొత్త డిజైన్లతో రూపొందిస్తున్నాం. పూర్తిగా మట్టితో సహజసిద్ధమైన రంగులతో తయారుచేసిన ఈ విగ్రహాలను కొనుగోలు చేయడానికి యువకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పండగ నాటికి దాదాపు అన్ని విగ్రహాలు అమ్మకమవుతాయి. ధరలు విగ్రహం ఎత్తును బట్టి రూ.6వేల నుంచి రూ.22వేల వరకు ఉన్నాయి. విగ్రహం తేలిగ్గా ఉంటుంది. ఇద్దరు మనుషులు సునాయాసంగా మోసుకెళ్లవచ్చు.

40 అడుగుల భారీ మట్టి గణనాథుడు

వరంగల్ నగరంలో తొలిసారి 40 అడుగుల ఎత్తు భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. వరంగల్‌లోని ఎల్లమ్మబజార్‌లో మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం తయారీ దాదాపు పూర్తయింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తర్వాత అతి పెద్ద వినాయక విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించనున్నారు. శ్రీ భద్రకాళి హిందూ ఉత్సవ నిర్వహణ సమితి ఆధ్వర్యంలో ఆకుతోట సంజు సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. కమలంపై నిల్చున్న భంగిమలో ఉన్న దుర్గ గణపతి ఎంతో గంభీరంగా, అందంగా ఆకట్టుకునే రీతిలో దర్శనమియ్యనున్నారు. వినాయక చవితి రోజు భద్రకాళి ఆలయం ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు తొలిపూజ నిర్వహిస్తారు. నవరాత్రులు ఉదయం, సాయంత్రం నిత్యవిధి పూజలు, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు పూర్ణాహుతి ఉంటుంది. ఈ భారీ వినాయకుని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా గట్టిగట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు చెందిన 30 మంది సెక్యూరిటీ గార్డులు రేయింబవళ్లు ఇక్కడ కాపలాగా ఉంటారు. సమితి నిర్వాహకులు శనివారం సీపీని కలిసి పోలీసు బందోబస్తును కూడా కోరారు. నవరాత్రులు ముగిసిన తర్వాత ఉన్నచోటనే విగ్రహ నిమజ్జనం నిర్వహిస్తారు. ఫైర్ ఇంజన్ సాయంతో పాలునీళ్లతో అభిషేకిస్తారు. దీంతో విగ్రహం క్రమంగా కరిగిపోయి ఉన్నచోట నిమజ్జనం అవుతుంది.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించేందుకే..

ఆకుతోట సంజు, ఎల్లమ్మబజార్, వరంగల్

ఖైరాతాబాద్‌లో భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించడం చూసిన తర్వాత వరంగల్‌లో కూడా అదే రీతిలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. పర్యావరణ పరిరక్షణ అంటే నాకు ఎంతో మక్కువ. ప్లాస్టర్ పారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టం ఎంతో కలిచివేసింది. ఇందుకు మట్టితో చేసి విగ్రహాలనే పూజించాలనే ఉద్దేశంతో వరంగల్‌లో భారీ మట్టి వినాయక విగ్రహం ఏర్పాటుకు సంకల్పించాను. నా స్వస్థలం ఎల్లమ్మబజార్‌లో భారీ గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. 3 నెలల కిందట విగ్రహం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. విగ్రహాన్ని ఉన్నచోటనే రాగడి మట్టి, గడ్డి, ఉనుక, కర్రలతో రూపొందిస్తున్నాం. సహజ సిద్ధంగా లభించే రంగులనే వాడుతున్నాం.

నెరవేరిన 'పీహెచ్‌డీ' కల

కేయూ క్యాంపస్, ఆగస్టు 31: ఎన్నో అవాంతరాలు, ఆటుపోట్లు, పోలీసు కేసులు, విద్యార్థులపై లాఠీ చార్జీలు, నిర్బంధాలను తట్టుకుని విద్యార్థులు చేసిన పీహెచ్‌డీ అడ్మిషన్ల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు కాకతీయ యూనివర్సిటీలో శనివారం అన్ని విభాగాలో పీహెచ్‌డీ అభ్యర్థుల అడ్మిషన్ల ప్రక్రియ సాఫీగా సాగింది. వర్సిటీలోని అన్ని విభాగాల్లో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు.. వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో తమ జాయినింగ్ రిపోర్టులను అందచేసి ధ్రువపత్రాలను పొందారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందడంతో అభ్యర్థులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

అలుపెరుగని పోరాటం

పీహెచ్‌డీ కేటగిరి-1, 2లలో సరైన నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ గతంలో కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎదుట పీహెచ్‌డీ ఆశావహులందరూ నిరవధిక నిరసనలు చేపట్టారు. అదే క్రమంలో అప్పటి వర్సిటీ ఉన్నతాధికారులు విద్యార్థుల దీక్షలను పట్టించుకోకుండా మొండిగా వ్యవహరించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విద్యార్థుల పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారం అప్పట్లో రాష్ట్ర స్థాయిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు విద్యార్థులకు అండగా నిలిచారు. వర్సిటీలో విద్యార్థులు చేసిన పోరాటానికి స్పందించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు చిరకాలవాంఛ అయిన పీహెచ్‌డీ అడ్మిషన్లను ఇప్పుడు కల్పించారు. ఇందుకు రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులకు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు జోక్యంతో అప్రమత్తంగా..

రాష్ట్ర హైకోర్టులో పీహెచ్‌డీ అడ్మిషన్లపై పిల్‌ను కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి దాఖలు చేశారు. పిల్ తీర్పు రాకముందే వర్సిటీ ఉన్నతాధికారులు అప్రమత్తమై న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తతో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. భవిష్యత్తులో కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా అడ్మిషన్లు పూర్తి చేశారు. అయితే హైకోర్టు దాఖలు చేసిన పిల్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన పీహెచ్‌డీ అడ్మిషన్ల వరకే వర్తిస్తుందని తెలుస్తోంది. మిగతా విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులను పిల్‌లో ఇంప్లీడ్ చేయలేదని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లు

కేయూ సోషల్ సైన్స్ విభాగంలో అత్యధికంగా 140 మందికి అడ్మిషన్లు కల్పించారు. వీరిలో ఎకనామిక్స్‌లో-7, హిస్టరీలో-21, టూరిజంలో-13, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో-22, హెచ్‌ఆర్‌ఎంలో-24, రాజనీతిశాస్త్రంలో- 32, సోషియాలజీలో- 12, సోషల్ వర్క్స్‌లో 14 మంది అభ్యర్థులు అడ్మిషన్లు పొందారు. అలాగే న్యాయశాస్త్రంలో 6, ఆర్ట్స్ విభాగంలో ఇంగ్లీష్‌లో-3, ఫార్మసీ విభాగంలో- 15, ఇంజనీరింగ్ విభాగంలోని ఈసీఈలో-7, సివిల్‌లో-1, మెకానికల్‌లో-1 చొప్పున అభ్యర్థులు అడ్మిషన్లు పొందారు. వీటితో పాటు కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో 15, లైఫ్‌సైన్స్ విభాగాల్లోనూ అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించారు.

వర్సిటీ భూమి కోసం పోరాటం

తీవ్ర చర్చనీయాంశంగా 'ఆంధ్రజ్యోతి' కథనం ● కదన రంగంలోకి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 31: కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూ వివాదాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి దక్కించుకోవాలని వర్సిటీ ఉద్యోగ, విద్యార్థి, మేధావి వర్గాలు భావిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రచ్చకెక్కుతున్న కేయూ భూ వివాదం 'కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. 1989లో అప్పటి తాత్కాలిక అవసరాల కోసం వర్సిటీ అధికారులను ఒప్పించి పోలీసు ట్రైనింగ్ కోసం 2 ఎకరాల స్థలాన్ని జిల్లా పోలీసుశాఖకు మాట మీద ఉచితంగా అప్పగించారు. అదే అదునుగా భావించిన పోలీసు అధికారులు వర్సిటీ భూముల్లో క్రమ క్రమంగా పాగా వేశారు. సీఆర్‌పీఎఫ్ క్యాంపుతో పాటు కేయూ పోలీస్‌స్టేషన్, జిల్లా పోలీసు అధికారుల ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. అంతటితో అగకుండా పోలీస్ ట్రైనింగ్ అవసరాల కోసమంటూ మరో 7ఎకరాల వర్సిటీ భూమికి కంచె వేశారు. వర్సిటీ అధికారులు వర్సిటీ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తామంటే తమకు ప్రత్యేకంగా గేటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసలే వర్సిటీ భూమి అన్యాక్రాంతమవుతోందని విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. సందెట్లో సడేమియా అన్నట్లు పోలీసు అధికారులు అందినకాడికి వర్సిటీ భూములను గుట్టుచప్పుడు కాకుండా చక్కబెట్టుకునే ప్రయత్నాలకు దిగారు. దీన్ని గుర్తించిన వర్సిటీ ఉన్నతాధికారులు పోలీసులకు అసలు ఎంత భూమి కేటాయించారు? అది ఏ ప్రతిపాదికన ఇచ్చారనే విషయంపై దృష్టి సారించారు. అదే విషయాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లగా, సీఎం రేవంత్‌తో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహాయంతో తిరిగి భూమిని తప్పకుండా దక్కించుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్నారని సమాచారం.

ఇదిలా ఉండగా, వర్సిటీకి చెందిన దాదాపు 10 ఎకరాల భూమిని పోలీసుశాఖ వాడుకుంటోందని లెక్కలు తీశారు. దీని విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.200 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వర్సిటీలో పోలీసుశాఖకు కేటాయించిన ఆయా భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటేనే భవిష్యత్తు తరాలకు వర్సిటీ సేవలందిస్తుందని చెబుతున్నారు. కాగా, వర్సిటీ ఉద్యోగ, మేధావి, విద్యార్థివర్గాలన్నీ ఏకమై జేఏసీగా ఏర్పడి వర్సిటీ భూముల రక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలనే నిర్ణయానికి వస్తున్నట్లు తెలిసింది. అయితే పోలీసు అధికారులు మాత్రం తమకే భూమి దక్కుతుందనే భరోసాతో ఉన్నారని తెలుస్తోంది.



రిజిస్ట్రార్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఎంఎస్‌ఎఫ్ నేతలు

ఎన్ఎస్ఎస్ విభాగానికి ఇవ్వాలి..

కేయూ చెందిన సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు ఇచ్చిన భూమిని వర్సిటీలోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగానికి ఇవ్వాలని ఎంఎస్‌ఎఫ్ నేతలు శనివారం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని అందచేసి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌ను తన చాంబర్‌లో కలిసి వర్సిటీ ఎన్ఎస్ఎస్‌కు సరైన సదుపాయాలు లేవని, ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, జిల్లా నాయకులు మంద భాస్కర్, కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, అజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో అధికారుల బృందం తనిఖీలు

మాజీ వర్సిటీ ఉన్నతాధికారుల ఫిర్యాదులపై ఆరా

కేయూక్యాంపస్, ఆగస్టు 31: కాకతీయ యూనివర్సిటీలో శనివారం విజిలెన్స్, రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. 5 శాఖల ఉన్నతాధికారుల ప్రత్యేక బృందంగా ఏర్పడి వర్సిటీలో కలియతిరిగి వర్సిటీ మాజీ ఉన్నతాధికారులపై వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. వర్సిటీలోని భూములన్నీ స్వయంగా తిరిగి పరిశీలించారు. వర్సిటీ భూముల సర్వే నెంబర్లలో ఉన్న భూమి ఎంత? ఎంత అన్యాక్రాంతమైందనే విషయంపై పరిశీలన చేశారు. వర్సిటీ భూముల హద్దులను పరిశీలించారు. భూమి ఆక్రమణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్సిటీ మాజీ ఉన్నతాధికారుల పాత్రను ప్రత్యేకంగా నోట్ చేసుకున్నారు. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వారు తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు, ఇతరులకు లబ్ధి చేకూర్చే అంశాలన్నీ ప్రస్తావించారు. తాజా మాజీ వర్సిటీ బాస్‌తో పాటు ఆయన హయాంలో పనిచేసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ బృందంలో ఇద్దరు జిల్లా విజిలెన్స్ అధికారులు, ఇద్దరు మునిసిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ నుంచి ఒక్కరు, తహసీల్దార్‌తో పాటు వర్సిటీ బిల్డింగ్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుల అరెస్టు



నేరస్తుల అరెస్టు చూపుతున్న పోలీసులు

జనగామ రూరల్, ఆగస్టు 31: ఉమ్మడి వరంగల్ జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ జనగామ మండలం యశ్వంతాపురం రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద రీతిలో ఉంటూ పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నా రన్నారు. వీరిని విచారించగా కాజీపేటకు చెందిన బంగారి నరేష్, వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ పాషా గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి 25 తులాల బంగారం, 137 తులాల వెండి, రూ.3,79,400.ల నగదు, స్కోడా కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐలు భరత్, చెన్నకేశవులు, ఏఎస్‌ఐ శంకర్, కానిస్టేబుళ్లు టి.రామన్న, డి.రామకృష్ణ, కె.అనిల్‌కుమార్, ఐ.సురేష్‌కుమార్‌ను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. అనంతరం వారికి డీసీపీ చేతులమీదుగా రివార్డులను అందించారు. కార్యక్రమంలో ఏసీపీ పార్థసారధి, ఎస్‌ఐ శ్వేత పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్యకు నెల్లుట్ల ఫౌండేషన్ సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్‌రావు

లింగాలఘణపురం, ఆగస్టు 31: పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య దంపతులను శనివారం నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సాహితీ రంగంలో విశేష సేవలందిస్తున్న వారి ని గుర్తించి ప్రతీ ఏటా నె ల్లుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన ంగా సన్మానిస్తుండడం ఆనవాయితీగా నడుస్తోంది. ఈక్రమంలో ఈ ఏడాదికిగాను పద్మశ్రీఅవార్డు గ్రహీత గడ్డం సమ్మ య్య దంపతులతో పాటుగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కొడకండ్ల రాధాకృష్ణశర్మ, హరికథకులు బొడిగె లక్ష్మీనారాయణ, రాష్ట్రస్థాయిలో గతంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న రహమాన్‌లను ఘనంగా సత్కరించారు.

మచ్చలేని ఉద్యోగ జీవితం ఆదర్శం

- ఆర్టీసీ డీఎం స్వాతి



పదవీ విరమణ సన్మానోత్సవంలో ఆర్టీసీ డీఎం స్వాతి, తదితరులు

జనగామ కల్చరల్, ఆగస్టు 31: ఏ రంగంలో పనిచేసినా మచ్చలేని ఉద్యోగ జీవితం అభినందనీయం, ఆదర్శమని జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.స్వాతి అన్నారు. శనివారం జనగామ ఆర్టీసీ డిపో నుంచి పదవీ విరమణ చేసిన సెక్యూరిటీ హెడ్ గార్డు రాంపెల్లి యాదగిరి, ఏడీసీలు ఎ.సత్తయ్య, ఎం.తిరుపతయ్య, కె.నర్సోజీ, డ్రైవర్ ఉప్పలయ్య వీడ్కోలు అభినందన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. డిపో కార్మికుల పక్షాన సిబ్బంది, వారి వారి బంధుమిత్రులు ఒక్కొక్కరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం స్వాతి మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని, మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టు, సామాజిక సేవాసారథి కన్న పరశురాములు మాట్లాడుతూ డిపో ప్రారంభం నుంచి కార్మికులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి డిపో అభివృద్ధికి కృషి చేశారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాటిస్తున్న సంప్రదాయం ప్రకారం పూర్వ ఉద్యోగి వీఎస్ఆర్.రెడ్డి పంపిన కేకులను పదవీ విరమణ చేసిన ఉద్యోగ దంపతులు కట్‌చేసి పరస్పరం అభినందించుకున్నారు. అసిస్టెంట్ మేనేజర్ డి.హుస్సేన్, ఎం.ఎఫ్. అజయ్‌కుమార్, ఏఎం ఎఫ్‌లు రవీందర్, ఎస్.రమేష్, టీఐ ముస్త్యాల ముత్తయ్య, బి.శ్రీనివాస్, ప్రతాప్, ఉపచారి, ఆర్.రాఘవరెడ్డి, రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

దేవుడి కొండపై పోటెత్తిన భక్తజనం



ఆలయం ఎదుట కోనేరు వద్ద భక్తుల సందడి

జఫర్‌గడ్, ఆగస్టు 31 : చారిత్రక జఫర్‌గడ్‌లోని శ్రీవేల్పుగొండ లక్ష్మీనరసింహస్వామి కొండపై శనివారం భక్తులు పోటెత్తారు. మండల కేంద్రంలోని పడమర కొండపై సతీ సమేతంగా రాతిని చీల్చుకుని వెలసిన మహిమాన్వితుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవాలు ప్రతీ ఏటా శ్రావణమాసంలో నెల రోజుల పాటు కొనసాగుతాయి. స్వామి వారిని దర్శిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఎంతో ప్రాశస్త్యం గల ఈ కొండపైకి జిల్లా నుంచే కాకుండా ఇతర సుదూర ప్రాంతాల నుంచి శ్రావణమాసంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా ఈ శ్రావణమాసంలో చివరి శనివారం కావడంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి తరలి వచ్చారు. వందలాదిగా భక్తుల రాకతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తుల జయజయధ్వానాలచే ప్రాంగణం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి పిల్లా పాపలతో కలిసి కొండపైకి చేరుకున్న భక్తజనులు ఆలయం ముందు గల కోనేరులో అభ్యంగనస్నానమాచరించారు. అనంతరం కోవెలలో స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు, అర్చనలు గావించి మొక్కులు చెల్లించారు. మము సల్లంగా చూడాలని, పాడి పంటలతో సుఖ సంతోషాలతో జీవించేలా, కోరిన కోరికలు నెరవేర్చేలా చూడు స్వామి.. అంటూ భక్తులు వేడుకున్నారు. ఆలయ అర్చక పూజారి పొడిచేటి సగంపాలు వెంకటాచార్యులు భక్తులకు ఆలయ ప్రాశస్త్యం, స్వామి వారి మహిమలను వివరించి తీర్థ ప్రసాదములను నివేదించారు. కాగా, స్వామి వారి శ్రావణమాసోత్సవాలు రేపు సోమవారం నాటితో ముగియనున్నాయి. కాగా, కొండపైకి స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల ఆకలి తీర్చేందుకు కొండ దిగువన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత భోజనం (అన్నదానం) వడ్డించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

జనగామ రూరల్, ఆగస్టు 31: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ ఎస్ఈ వేణు మాధవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో జనగామ సర్కిల్ విద్యుత్ అధికారులతో ఎస్ఈ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాటా బేస్ సమాచారం ఏ లోకేషన్‌లో అయితే ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్ అయ్యే అవకాశం ఉన్న వాటిని తనిఖీ చేసి లోపాలను సవరించాలని తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన యూనిక్ పోల్ నంబరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీస్‌లకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు, వర్క్ ఆర్డర్లు త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిపొందని వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

సోమన్న దేవాలయం ఈవోగా మోహన్‌బాబు



మోహన్‌బాబు

పాలకుర్తి, ఆగస్టు 31 : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఈవోగా మోహన్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ఇక్కడ పని చేసిన లక్ష్మీప్రసన్న సెలవుపై వెళ్లగా యాదాద్రి జిల్లా శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవా లయంలో ఈవోగా పని చేస్తున్న మోహన్‌బాబు అదనంగా పాలకుర్తి ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కొడకండ్ల, ఆగస్టు 31 : మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు కూనూరు ఐలయ్య ఇటీవల తాడిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. ఆయన కుమారుడికి జనగామలో శనివారం ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎడ్యుకేషన్) బుర్ర వెంకటేశం గౌడ్ చేతుల మీదుగా టాడీ కార్పోరేషన్ నుంచి 25 వేల చెక్కును అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, గౌడ హక్కుల ఐక్య సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి వెంకన్న, రాష్ట్రస్థాయి నాయకుడు బాల్నె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్‌ఎస్‌లో వైద్యశిబిరం

కొడకండ్ల, ఆగస్టు 31 : మండలకేంద్రంలోని టీఎస్‌ఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డా.హరికృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌ఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ దిలీప్ తమ్మి, పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి

చిలుపూర్, ఆగస్టు 31 : ప్రతీఒక్కరూ కులమతాలను వీడి స్నేహభావంతో మెలగాలని ఎమ్మార్వో (మండల రెవెన్యూ అధికారి) కలువల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వంగాలపల్లిలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంటరానితనం, కుల వివక్ష, బాల్యవివాహాలు తదితర కార్యక్రమాలను గూర్చి గ్రామస్థులకు వివరించారు. ఎవరైనా కులవివక్ష, అంటరానితనం తదితర కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు భూక్య సుధాకర్‌నాయక్, ఆరూరి ప్రణీత -ప్రభుదాస్, చిట్యాల దయాకర్, ఆమంచ రవి, ఆరూరి దాసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిలుపూర్, ఆగస్టు 31 : ప్రతీఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మల్కాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కుశాలి అన్నారు . శనివారం మండలంలోని మల్కాపూర్, కొండాపూర్, చిలుపూర్, వెంకటాద్రిపేట తదితర గ్రామాలను సందర్శించిన ఆమె ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంటి ఆవరణలో మురుగునీటిని నిల్వ ఉంచరాదని సూచించారు. ఇటీవల కొద్ది రోజులుగా మల్కాపూర్ పీహెచ్‌సీతో పాటు, సబ్ సెంటర్లలో జ్వరాల బారిన పడ్డ రోగుల సంఖ్య పెరిగిందన్నారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామాల వారీగా వైద్యశిబిరాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఏఎన్ఎంలు సంతోష, సునంద తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

జనగామ రూరల్, ఆగస్టు 31: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంగళపల్లి జనార్దన్ శనివారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొద్ది రోజులు నుండి చేనేత కార్మికులు అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులను రై 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు.

దళితుల దేవుడు ఫాదర్ కొలంబో



కొలంబో వర్ధంతి సందర్భంగా పండ్లు పంపిణీ చేస్తున్న యూత్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 31: దశాబ్దాల క్రితమే ఇతర దేశం నుంచి వచ్చి స్టేషన్ ఘన్‌పూర్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలకు విద్య, వైద్యం, ఆహారం, ఉపాధి కల్పించిన దేవుడు ఫాదర్ కొలంబో అని యువ శక్తి యూత్ అధ్యక్షుడు ఎం.వరుణ్ అన్నారు. శనివారం ఫాదర్ కొలంబో 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్సీ కాలనీలోని కొలంబో విగ్రహానికి పూల మాల వేసి పలువురు నివాళులు అర్పించారు. కమిటీ నాయకులు కె.నివాస్, కరుణాసాగర్, అ భిషేక్, నితిన్ పాల్గొన్నారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి వార కల్యాణం

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



వేంకటేశ్వరస్వామి వార కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చిలుపూర్, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని శనివారం వేడుకగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో చేపట్టిన కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, రామ్ బ్రహ్మాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వరస్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా ముగించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామివారి నిత్యసేవకులు, ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు - కిరణ్మయి దంపతులు, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

వేంకన్నకు ఇన్వర్టర్ బహూకరణ

- కాగా, వార కల్యాణానికి హాజరైన దాతలు నారగోని రాజ్‌కుమార్ - విజిత, నరేష్‌కుమార్ - సృజన దంపతులు స్వామివారికి రూ 30 వేల విలువ విద్యుత్ ఇన్వర్టర్‌ను సిబ్బంది సమక్షంలో బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ ఇంటి ఇలవేల్పు బుగులు వేంకటేశ్వర స్వామిని ప్రతీయేటా శ్రావణమాసంలో కుటుంబంతో సహా దర్శించుకుంటామని పేర్కొన్నారు.

కడవెండి మాజీ సర్పంచ్ కన్నుమూత



ఎల్లయ్య(ఫైల్)

దేవరుప్పుల, ఆగస్టు 31: ఉమ్మడి కడవెండి గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మగాళ్ల ఎల్లయ్య-(74) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం కన్ను మూశారు. గత రెండురోజుల క్రితం బీపీ ఎక్కువై బ్రేయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. 1981 ఎన్నికల్లో కడవెండి గ్రామ సర్పంచ్‌గా సీతారాంపురం గ్రామానికి చెందిన అస్నాల అంజాజీ వార్డు సభ్యుడిగా గెలిచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనశక్తి- పీపుల్స్‌వార్ ఉద్యమం కడవెండి ప్రాంతంలో పోటాపోటీగా నడుస్తున్న నేపధ్యంలో సీతారాంపురం గ్రామంలో అప్పటి ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్‌గా కడవెండికి చెందిన సోమిరెడ్డి జనశక్తి నక్సల్స్ చేతిలో 1982లో తుపాకీ తూటాకు పాఠశా లలోనే హతమయ్యారు. ఆసమయంలో అప్పటి సర్పంచ్ అంజాజీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆయన ఏడాది వరకు కూడా తిరిగి రాకపోవడంతో సర్పంచ్ ఎన్నిక అనివార్యం అయింది. 3వ వార్డు సభ్యుడైన కొమ్మగాళ్ల ఎల్లయ్య కడవెండి సర్పంచు లుగా 1983లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన పదవీకాలంతో పాటు ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా పదవీ కాలం కొనసాగించిన సమయంతో పాటు సుమారు ఆరేళ్లపాటు ఆయన సర్పంచ్‌గా విధులు నిర్వర్తించారు. ఎల్లయ్యకు భార్య ఎల్లమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పలువురి సంతాపం

కడవెండి గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మగాళ్ల ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా శనివారం కడవెండిలో ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎల్లయ్య ఉమ్మడి కడవెండికి చేసిన సేవను కొనియాడారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, మండల అధికార ప్రతినిధి సుడిగెల హన్మంతు, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ నక్క రమేష్, కడవెండి గ్రామశాఖ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రఘునాథపల్లి, ఆగస్టు 31: మహిళలు ఆర్థికస్వాలంబనతో సాధికారత సాధిస్తు అందరికి ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. నవభారతి మండల సమాఖ్య 15వ వార్షికోత్సవ సమావేశం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం జరిగింది. సమావేశానికి ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తు ఆర్థిక స్వాలంబన సాధించాలని తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళ శక్తి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాజా మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం కె.సారయ్య, సీసీలు రీనావతి, భాగ్యలక్ష్మి, ఉమాదేవి, సరోజన, ఎల్లస్వామి, సంపత్, జంపయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, యశోద, స్వర్ణలత పాల్గొన్నారు.

వికసిత్ భారత్ బీజేపీతోనే సాధ్యం



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న శివరాజ్‌యాదవ్

నర్మెట, ఆగస్టు 31 : పార్టీకి కార్యకర్తలే పునాది వంటి వారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శివరాజ్‌యాదవ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో బీజేపీ మండల కన్వీనర్ సొక్కం అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు రంగు మురళి అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శివరాజ్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. భారత్ విశ్వగురువుగా మారాలన్న, వికసిత్ భారత్ సాకారం కావాలన్న బీజేపీతోనే సాధ్యమన్నారు. సంక్షేమ పాలన, అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇచ్చేందుకు బీజేపీ కృషి చేస్తుందన్నారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024 కాల్ చేస్తే వచ్చే లింక్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జి ధరావత్ రాజు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బైరగోని ఆంజనేయులు, నాయకులు చెవుల రాజు తదితరులు పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్ రెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ యాదవ్ అధ్యక్షతన శనివారం జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదుపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని తెలిపారు. కార్యక్రమంలో కొంతం శ్రీనివాస్, నామాల మహేందర్, మరపాక అనిల్, బండశ్రీనివాస్, ముక్క స్వామి పాల్గొన్నారు.

పాల్కూరికి పేరు పెట్టేలా సీఎం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మార్గం ఫౌండేషన్ బాధ్యులు

పాలకుర్తి, ఆగస్టు 31 : తెలుగు విశ్వవిద్యా లయా నికి పాల్కూరికి సోమనాథుడు పేరు పెటేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తీసుకెళ్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివా రం తొర్రూరులో క్యాంపు కార్యాలయంలో మార్గం ఫౌండేషన్, స్టూడెంట్ ఫర్ సేవా ట్రస్టుల ప్రతినిధులు కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి తెలుగు యూనివర్సిటీకి పాల్కూరికి పేరు పెట్టాలని వినతిపత్రం అందచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియో జకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని కలిసి వివరించాలరు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కలిసిన ప్రతినిధుల్లో డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ, ఆ సంస్థ అధ్యక్షుడు మార్గం సాయిసందీప్ తేజ, తొర్రూరు మాజీ వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, బిజ్జాల సోమన్న, యాకయ్య తదితరులు ఉన్నారు.

ఆభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ తృతీయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

రఘునాథపల్లి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని శ్రీమహాదేవ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీఆభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం విగ్రహ దాత బచ్చు చిరంజీవులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పిండిప్రోలు శ్రీనివాస శర్మ, మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్, కోళ్ల రవి, వేదకుమార్, బచ్చు శ్రీధర్, లింగయ్య, గౌరిశంకర్, బెల్దె శ్రీనివాస్, పోషనాథం, చింతకింది కృష్ణమూర్తి, కోళ్ల రాజు, సంపత్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఏసీపీ నర్సయ్య

పాలకుర్తి, ఆగస్టు 31 : గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా శాంతియుతంగా జరుపుకోవాలని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల గణపతి ఉత్సవ కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సయ్య హాజరై మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరపాలని నిర్వాహ కులకు సూచించారు. తొమ్మిది రోజులు జరుకునే ఈ ఉత్సవాల నిర్వహనకు అనుమతి అవసరమన్నారు. రాత్రి 10 గంటలకు మాత్రమే మైక్ సెట్ స్పీకర్లను వినియోగించాలని సూచించారు. మండపాల్లో ఎట్టి పరిస్థితుల్లోను డీజేలను ఏర్పాటు వద్దని, నాణ్యత షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడడం, లక్కీ డ్రాలు నిర్వహించడం అసభ్యకరమైన నృత్యాలు చేయరాదని హెచ్చరించారు. అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, సృజన్‌కుమార్, లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 51 వేల విరాళం



రూ.51 వేలు ఆలయ కమిటీకి విరాళం అందిస్తున్న ఆమెడపు కమలాకర్‌రెడ్డి

నర్మెట, ఆగస్టు 31 : మండలకేంద్రంలోని వీరాంజనేయస్వామి దేవాలయానికి తూర్పు దిశలో ఉన్న 180 గజాల స్థలాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. అందులో 25.5 గజాల స్థలానికి గ్రామ తాజా మాజీ సర్పంచ్ దంపతులు ఆమెడపు కమలాకర్‌రెడ్డి- గీత రూ. 51116, అమ్మాపురం గ్రామానికి చెందిన గంగం ప్రవీణ్‌రెడ్డి 5 గజాలకు గాను రూ. 10 వేలు శనివారం విరాళంగా ఇచ్చారు. ఈసందర్భంగా ఆమెడపు కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కమలాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జంగిటి అంజయ్య, పూజారి నాగభూషణశర్మ, బిజ్జ సత్యనారాయణ, ఆమెడపు లక్ష్మారెడ్డి, యేలగొండ రవి, శ్రీశైలం పాల్గొన్నారు.

కక్షిదారులకు న్యాయం చేయాలి

హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా



బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి

జనగామ రూరల్, ఆగస్టు 31: న్యాయవాదులు కలిసి కట్టుగా కక్షిదారులకు త్వరితగతన న్యాయం చేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా అన్నారు. శనివారం హైకోర్టు జడ్జి జనగామ కోర్టులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటి మహిళ బార్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. మెడికల్ క్యాంపును ప్రారంభించి జడ్జి పరీక్షలు చేయించుకున్నారు. బ్యాడ్మింటన్ కోర్టు, మహిళల రెస్ట్ రూం, లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జనగామ కోర్టులో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బార్ అసోసియేషన్‌లో ఏమైనా సమస్యలు, అవసరాలు ఉంటే తన వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందజేస్తానన్నారు. హైకోర్టు జడ్జికి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌లు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ, సినియర్ సివిల్ జడ్జి విక్రం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రబుషి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో జడ్జి పూజలు

పాలకుర్తి :జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బమ్మెరలో పోతన స్మారక సమాధి వద్ద తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరెపెల్లి నంద కుటుంబ సభ్యులతో సందర్శించి నివాళ్లర్పించారు.ఈ సందర్భంగా ఈ ప్రాంత ప్రత్యేకను సోమేశ్వరాలయం పూజారులు న్యాయమూర్తి నందకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తిలో బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడు, భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన, వాల్మీకి లాంటి గొప్ప కవులు నడియాడిన ప్రాంతాన్ని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. ఆమె వెంట జిల్లా జడ్జి రవీంద్రశర్మ, సీనియర్ జడ్జీ విక్రమ్, ప్రిన్సిపల్ జడ్జీ సుచరిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సందీప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.